
సాక్షి అనకాపల్లి
సోమవారం ၊ 26 ၊ ఆగస్టు ၊ 2024



ఆక్రమణ తొలగింపుపై వివాదం
చోడవరం పట్టణంలో పంచాయతీ అధికారులు చేపట్టిన ఆక్రమణల తొలగింపు వివాదాస్పదమైంది. 8లో



నదిలో రైతు గల్లంతు 8లో
సరుగుడు మొక్కలు ఎలా ఉన్నాయో చూసేందుకు పొలానికి బయలు దేరిన ఓ రైతు వరాహనదిని దాటుతూ గల్లంతయ్యాడు.



సిద్ధి వినాయకులు సిద్ధం
గణేష్ నవరాత్రి ఉత్సవాలకు విగ్రహాలు సిద్ధమయ్యాయి. జిల్లాలోని పలు ప్రాంతాల్లో విగ్రహాల తయారీ ఊపందుకుంది. 8లో

న్యూస్‌రీల్

నర్సీపట్నం సబ్ కలెక్టర్‌గా కల్పశ్రీ

నర్సీపట్నం: నర్సీపట్నం సబ్ కలెక్టర్‌గా కల్పశ్రీని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కర్ణాటక రాష్ట్రానికి చెందిన ఈమె 2022లో ఐఏఎస్‌కు ఎంపికయ్యారు. శిక్షణ అనంతరం నర్సీపట్నం సబ్ కలెక్టర్‌గా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం ఆర్డీవోగా పని చేస్తున్న జయరాంను బదిలీ చేసింది.

నేటి నుంచి క్రీడా పోటీలు

తుమ్మపాల: మేజర్ ధ్యాన్‌చంద్ జయంతి సందర్భంగా నిర్వహించే జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర క్రీడాప్రాధికార సంస్థ, కలెక్టర్ మార్గదర్శకాలకు అనుగుణంగా ఈ నెల 26 నుంచి 31వ తేదీ వరకు పలు క్రీడా పోటీలతో పాటు క్విజ్, వ్యాసరచన పోటీలు నిర్వహించనున్నట్టు జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి ఎల్.వి.రమణ ఓ ప్రకటనలో తెలిపారు. విజేతలకు సర్టిఫికెట్లు అందజేయడంతో పాటు ప్రతిభ చూపిన క్రీడాకారులను, శిక్షకులను సత్కరించనున్నట్టు తెలిపారు.

నదిలో పడి విద్యార్థి మృతి



నదిలోంచి విద్యార్థి మృతదేహాన్ని తీసుకువస్తున్న బంధువులు

నర్సీపట్నం: స్థానిక ఎస్సీకాలనీకి చెందిన తారక్(14) అనే విద్యార్థి ప్రమాదవశాత్తు కాలు జారి నదిలో పడి మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలో ఓ ప్రైవేటు పాఠశాలలో 9వతరగతి చదువుతున్న తారక్ ఆదివారం సెలవు దినం కావడంతో స్నేహితులతో కలిసి బలిఘట్టం ఉత్తరవాహిని నదీతీరంలో అన్న సంతర్పణ కార్యక్రమానికి వెళ్లాడు. భోజనం అనంతరం నదీ తీరానికి వెళ్లాడు. అక్కడ ప్రమాదవశాత్తు కాలుజారి నదిలో పడిపోయాడు. అందిన సమాచారం మేరకు పోలీసులు నది వద్దకు చేరుకుని స్థానికుల సాయంతో గాలించగా విద్యార్థి మృతదేహం లభ్యమైంది. కుటుంబ సభ్యులు, బంధువులు నది వద్దకు చేరుకుని తారక్ మృతదేహాన్ని చూసి భోరున విలపించారు. పోస్టుమార్టానికి మృతదేహాన్ని ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు టౌన్ పోలీసులు తెలిపారు.

ప్రతి మహిళా ఆర్థికంగా ఎదగాలి



మహిళలకు చెక్కు అందిస్తున్న దయానిధి

తుమ్మపాల: స్వయం సహాయక సంఘ సభ్యులు ప్రభుత్వం అందించే తోడ్పాటును సద్వినియోగం చేసుకుని, ఆర్థికంగా ఎదగాలని డీఆర్‌వో బి.దయానిధి ఆకాంక్షించారు. మహారాష్ట్రలోని జల్గావ్‌లో ప్రధాని మోదీ ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన 'లక్ పతి దీదీ'కార్యక్రమాన్ని వర్చువల్ విధానంలో జిల్లాలో డీఆర్వో బి.దయానిధి, డీఆర్‌డీఏ పీడీ శచీదేవి, స్వయం సహాయక సంఘాల సభ్యులు వీక్షించారు. జిల్లాలోని ఉత్తమ ప్రతిభ కనబరిచిన, ఆర్థికంగా ఉత్తమ లక్ష్యాలు సాధించిన సభ్యులను సత్కరించి సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. 614 మంది స్వయం సహాయక సంఘ సభ్యులు ఉన్న 193 సంఘాల సహాయార్థం బ్యాంకు లింకేజీ ద్వారా సమకూర్చిన రూ.2.11 కోట్ల విలువైన చెక్కును సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా డీఆర్‌వో మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ నిబద్ధతతో పనిచేయాలని, తీసుకున్న రుణాలను సద్వినియోగం చేసుకుంటూ ప్రగతి సాధించాలని సూచించారు.

'సరుగుడు'లో సందడి



సరుగుడు జలపాతం వద్ద సందర్శకులు

నాతవరం: సరుగుడు జలపాతం వద్ద ఆదివారం సందర్శకులు సందడి చేశారు. ఎత్తైన రెండు కొండల మధ్యలోంచి ప్రవహించే జలపాతంలో జలకాలు ఆడేందుకు పోటీ పడ్డారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు జలపాతం వద్ద ఆటపాటలతో సరదాగా గడిపారు. కాకినాడ,అనకాపల్లి జిల్లాల నలుమూలలు నుంచి సందర్శకులు రావడంతో సరుగుడు వెళ్లే రోడ్డులో వాహనాల రద్దీ పెరిగింది. తాండవ రిజర్వాయర్‌పై సందర్శకులు తాకిడి కనిపించింది. ప్రాజెక్టులోనీటి మట్టం ప్రమాదస్థాయికి చేరువ లో ఉండడంతో ప్రాజెక్టు లోపలకు వెళ్లడానికి సందర్శకులకు ఇరిగేషన్ అధికారులు అనుమతించలేదు.



మహిళా ఉద్యోగులకు భద్రత కల్పించాలి

ఆస్పత్రుల్లో విధుల్లో ఉండే మహిళా వైద్యులు, సిబ్బందికి ప్రభుత్వం భద్రత కల్పించాలి. రాత్రి పూట విధులు నిర్వర్తించే సమయంలో రోగులతో పాటు వచ్చే సహాయకుల నుంచి సిబ్బందికి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. వైద్య సిబ్బంది కోసం ప్రభుత్వాలు రక్షణ చట్టాలను కఠినంగా అమలు చేయాలి. ఆస్పత్రుల్లో పోలీస్ ఔట్ పోస్టుతో పాటు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి పటిష్ట రక్షణ కల్పించాలి.

–ఇ. పూజ్య మేఘన, పీహెచ్‌సీ వైద్యాధికారి, దేవరాపల్లి




పోలీస్ సిబ్బందిని నియమించాలి

వైద్య వృత్తిని పరమావధిగా భావించి సేవ చేస్తున్న వైద్యులు, సిబ్బంది రక్షణకు ప్రభుత్వం ప్రత్యేక చట్టాలు రూపొందించాలి. రాత్రి పూట ధైర్యంగా వైద్య సేవలందించేలా ఆస్పత్రుల్లో పోలీస్ సిబ్బందిని నియమించి రక్షణ కల్పించాలి. ఆస్పత్రుల్లో వాచ్ మెన్‌తో పాటు మహిళా అటెండర్ తప్పనిసరిగా ఉండేలా చర్యలు తీసుకోవాలి.వైద్యులు, సిబ్బందిపై దాడుల పట్ల ప్రభుత్వాలు కఠినంగా వ్యవహరించాలి.

–బి. హారిక, వైద్యాధికారి, వేచలం పీహెచ్‌సీ, దేవరాపల్లి మండలం

ఫీవర్రీ

సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయి. **దీంతో** ఆస్పత్రులకు రోగుల తాకిడి **భారీగా పెరిగింది.** సాధారణ జ్వరాలతో పాటు **వైరల్ ఫీవర్స్** చుట్టుముట్టడంతో బాధితులు **అల్లాడిపోతున్నారు.** టైఫాయిడ్, చికెన్ గున్యా, డెంగ్యూ తదితర వ్యాధులతో ప్రజలు ఆస్పత్రులకు పరుగులు తీస్తున్నారు. శనివారం 'సాక్షి' నిర్వహించిన క్షేత్ర స్థాయి పరిశీలనలో జిల్లాలోని అధ్వాన పరిస్థితులు వెలుగుచూశాయి.



- జిల్లాలో విజృంభిస్తున్న సీజనల్ వ్యాధులు
- రోజు రోజుకు పెరుగుతున్న మలేరియా, డెంగ్యూ జ్వరపీడితులు
- గ్రామాల్లో అధ్వానంగా పారిశుధ్యం
- ప్రభుత్వ ఆస్పత్రులకు రోగుల తాకిడి
- 'సాక్షి' క్షేత్రస్థాయి పరిశీలన

జిల్లాలో ఆస్పత్రులు

జిల్లా ఆస్పత్రి	01
ఏరియా ఆస్పత్రి	01
పీహెచ్‌సీలు	46
సీహెచ్‌సీలు	06
యూపీహెచ్‌సీలు	09

ఆగస్టులో పలు ఆస్పత్రుల్లో నమోదైన కేసుల వివరాలు

జ్వరాలు	20,513
మలేరియా	18
డెంగ్యూ	15

- అనకాపల్లిలోని జిల్లా ఆస్పత్రిలో ఆగస్టు నెల(24 వరకూ)లో 350 నుంచి 400 వరకు జ్వరాల కేసులు నమోదయ్యాయి.
- జిల్లాలో అత్యధికంగా మాడుగుల నియోజకవర్గంలో ఎనిమిది పీహెచ్‌సీలు, 3 సీహెచ్‌సీల పరిధిలో వేయి మంది జ్వరాలతో చికిత్స పొందారు. వీటిలో 82మలేరియా, 3 డెంగ్యూ జ్వరాలు నమోదయ్యాయి.
- నర్సీపట్నం నియోజకవర్గంలో 14 పీహెచ్‌సీలు, ఒక ఏరియా ఆస్పత్రి పరిధిలో 400కు పైగా జ్వరాల కేసులు నమోదయ్యాయి.



నర్సీపట్నం ఏరియా ఆస్పత్రిలో ఓపీ క్యూలైన్లలో రోగులు

సాక్షి గ్రాండ్ రిపోర్ట్

సాక్షి, అనకాపల్లి: ఇటీవల కురిసిన వర్షాలకు పల్లెల్లో పారిశుధ్యం క్షీణించి సీజనల్‌జ్వరాలు ప్రబలుతున్నాయి. అధికారం చేపట్టి సుమారు మూడు నెలల అవుతున్నా కూటమి సర్కార్ ప్రజా ఆరోగ్యంపై దృష్టి సారించడం లేదు. జిల్లాలో ఏజెన్సీని ఆనుకుని ఉన్న మండలాల్లో జ్వర పీడితులు అధికంగా ఉన్నారు. నర్సీపట్నం, మాడుగుల, పాయకరావుపేట నియోజకవర్గాల పరిధిలో సీజనల్ జ్వరాలు తీవ్రత ఎక్కువగా ఉంది. డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ జ్వర బాధితుల సంఖ్య పెరుగుతోంది. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఓపీ విభాగం వద్ద రోగులు బారులు తీరుతున్నారు.

డెంగ్యూ జ్వరాలు డేంజర్

జూన్‌లో ప్రారంభమైన విష జ్వరాల తాకిడి ప్రస్తుతం కొనసాగుతోంది. డెంగ్యూ వచ్చిన వారిలో సహజంగానే 3 నుంచి 5 రోజుల వరకు ఆ లక్షణాలు కనిపించవు. మరికొందరిలో మాత్రం జ్వరం వచ్చిన వెంటనే లక్షణాలు కనిపిస్తాయి. డెంగ్యూ వచ్చిన వారికి 104 ఫారెన్ హీట్ డిగ్రీల జ్వరం ఉంటుంది. తలనొప్పి, కండరాలు, ఎముకలు, కీళ్ల నొప్పులు ఉంటాయి. వికారం, వాంతులు మరో ప్రధాన లక్షణం. కళ్లు మండటం, వికారం, వాంతులు, తీవ్రమైన కడుపు నొప్పి, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, అలసట, విసుగు డెంగ్యూ జ్వరం లక్షణాలు. డెంగ్యూ జ్వరం ఉంటే శరీరంలో ప్లేట్‌లెట్ల సంఖ్య గణనీయంగా తగ్గిపోతుంది. డెంగ్యూ జ్వరానికి నిర్దిష్టమైన చికిత్స అంటూ లేదు. అందుకే ఈ లక్షణాలను బట్టి ఎప్పటికప్పుడు చికిత్స చేయించుకోవాలి. డెంగ్యూ లక్షణాలను నిర్లక్ష్యం చేస్తే ప్రాణానికే ప్రమాదం. జిల్లాలో అనకాపల్లి, నర్సీపట్నంలలో మాత్రమే ఈ పరీక్షలు చేసే అవకాశం ఉంది.



ఓపీ నమోదు చేసుకుంటున్న యువతి



చికిత్స పొందుతున్న ఇన్‌పేషెంట్లు



డాక్టర్ చాంబర్ వద్ద నిరీక్షిస్తున్న రోగులు



నర్సీపట్నం మున్సిపాలిటీ పరిధి పెద్దబొడ్డేపల్లిలో మెయిన్ రోడ్డు పక్కన చెత్త

ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నాం..

జిల్లాలో డెంగ్యూ, మలేరియా జ్వరాలు తక్కువగానే ఉన్నాయి. ప్రజలకు సీజనల్ వ్యాధుల మీద అవగాహన కల్పిస్తున్నాం. ఆస్పత్రికి జ్వరంతో వచ్చిన ప్రతి ఒక్కరికీ డెంగ్యూ, మలేరియా పరీక్షలు తప్పనిసరిగా చేస్తున్నాం. సచివాలయ ఏఎన్‌ఎం, ఎంఎల్‌హెచ్‌పీలతో ఎప్పటికప్పుడు అవగాహన కల్పిస్తున్నాం. కలెక్టర్ ఆదేశాల మేరకు పలు శాఖల అధికారుల సమన్వయంతో డెంగ్యూ, మలేరియా, సీజనల్ వ్యాధుల మీద ప్రజలకు అవగాహన కార్యక్రమాలు,సదస్సులు నిర్వహిస్తున్నాం.

– డాక్టర్ బాలాజీ, డీఎంహెచ్‌వో, అనకాపల్లి



ఓపీ నమోదు చేసుకుని డాక్టర్‌ను కలిసేందుకు క్యూలో ఉన్న రోగులు

జిల్లాలో శనివారం పరిస్థితి..

సీజనల్ వ్యాధుల కారణంగా ప్రభుత్వ ఆస్పత్రులకు వచ్చిన రోగుల సంఖ్య గణనీయంగా పెరిగింది. జిల్లాలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో శనివారం 830 జ్వర కేసులు నమోదయ్యాయి. ఉదయం 9 గంటల నుంచి ఓపీ ప్రారంభమైంది. డాక్టర్లు ఉదయం 9 గంటలకు వచ్చారు.

'ఊరు'తోంది మురుగు

ఊరుతున్నట్టుగా పలు పల్లెల్లో ఎక్కడ చూసిన మురుగునీటి గుంటలు దర్శనమిస్తున్నాయి. చెత్త పేరుకుపోవడంతో గ్రామాలు కంపుకొడుతున్నాయి. పారిశుధ్యం క్షీణించడంతో దోమలు విపరీతంగా వృద్ధి చెందుతున్నాయి. మురుగు కాల్వలల్లో చెత్తపేరుకుపోవడం.. తాగునీటిలో సరిగ్గా క్లోరినేషన్ చేయకపోవడం.. ప్రజలకు ప్రాణసంకటంగా మారింది.



చినగుమ్మలూరులో రోడ్డుపై నిలిచిన మురుగు నీరు

మూడు నెలల్లో ...

డెంగ్యూ జ్వరాలు

- జూన్‌లో 328 మంది రోగుల నుంచి బ్లడ్ శాంపిల్స్ తీసుకుంటే వాటిలో 11 మందికి డెంగ్యూ నిర్ధారణ అయింది.
- జులై నెలలో 482 మంది రోగుల నుంచి బ్లడ్ శాంపిల్స్ తీసుకుంటే 26 మందికి డెంగ్యూ నిర్ధారణ అయింది.
- ఆగస్టు నెల(ఇప్పటి వరకూ)లో 287 మంది రోగులు నుంచి శాంపిల్స్ తీసుకుంటే వాటిలో 15 మందికి డెంగ్యూ నిర్ధారణ అయింది.

మలేరియా జ్వరాలు..

- జూన్ నెలలో 32,714 శాంపిల్స్ సేకరిస్తే..36 మలేరియా కేసులు నిర్ధారణ అయ్యాయి.
- జులై నెలలో 41,044 శాంపిల్స్ సేకరిస్తే..47 మలేరియా కేసులు నిర్ధారణ అయ్యాయి
- ఆగస్టులో 19,076 శాంపిల్స్ (ఫీల్డ్‌తో కలిపి) సేకరిస్తే..18 మలేరియా కేసులు నిర్ధారణ అయ్యాయి.

నిర్వాసితులకు న్యాయం జరిగే వరకు పోరాటం

- ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ చెల్లించాల్సిందే
- మేజర్లకు కూడా పరిహారం ఇవ్వాలి
- రైతుల సమావేశంలో నాయకులు



సమావేశంలో నిర్వాసితులకు సంఘీభావం ప్రకటిస్తున్న నాయకులు

నక్కపల్లి: విశాఖ–చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ నిర్మాణం కోసం ఏపీఐఐసీకి భూములు ఇచ్చిన నిర్వాసితులు, రైతులకు పూర్తిస్థాయిలో న్యాయం జరిగే వరకు పోరాడుతామని అఖిలపక్షనాయకులు స్పష్టం చేశారు. ఆదివారం పాటి మీద గ్రామంలో నిర్వాసితులు, రైతుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత, కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ వీసం రామకృష్ణ, సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎం.అప్పలరాజు, రైతు నాయకులు తళ్ల భార్గవ్, సూరాకాసుల గోవిందు తదితరులు మాట్లాడుతూ ఇండస్ట్రియల్ కారిడార్ కోసం రైతులు వద్దేళ్లక్రితం ప్రభుత్వానికి ఐదు వేల ఎకరాలు ఇచ్చారన్నారు. చందనాడ, రాజయ్యపేట, అమలాపురం, వేంపాడు, డీఎల్ పురం తదితర గ్రామాల్లో రైతులనుంచి సేకరించిన భూములకు నష్టపరిహారంతోపాటు, చెట్లకు, షెడ్లకు పరిహారం చెల్లించారన్నారు. భూసేకరణ సమయంలో ఇస్తామన్న ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ విషయంపై ప్రభుత్వం స్పందించడం లేదని చెప్పారు. 2013 భూసేకరణ చట్టం ప్రకారం నష్టపరిహారం చెల్లిస్తామని నమ్మించి భూములు తీసుకున్నారన్నారు. అయితే ఎకరాకు రూ.18లక్షల చొప్పున మాత్రమే పరిహారం చెల్లించారని తెలిపారు. 2013 భూసేకరణ చట్టం ప్రకారం పరిహారం చెల్లించడంతోపాటు సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారం నిర్వాసితులకు పునరావాసం కల్పించాలని, ఇంట్లో మేజర్లు ఉంటే రూ.25లక్షల చొప్పున ఆర్‌అండ్ ఆర్‌ప్యాకేజీ చెల్లించాల్సి ఉందన్నారు. 10 సెంట్ల ఇంటి స్థలం, స్థానికంగా ఏర్పాటు చేసే పరిశ్రమల్లో నిర్వాసితులకు ఉద్యోగాల కల్పనలో ప్రాధాన్యం ఇవ్వాలని, ఆర్ కార్డులు జారీ చేయాలని డిమాండ్ చేశారు. చాలా మంది డీఫారం రైతులకు, ప్రభుత్వ భూములు సాగుచేసుకుంటున్న వారికి ఇంకా పరిహారం చెల్లించలేదని చెప్పారు. చందనాడలో ప్రభుత్వ భూముల్లో గుల్లబట్టీలు ఏర్పాటు చేసుకుని ఉపాధి పొందుతున్న దళితులకు ఎటువంటి నష్టపరిహారం ఇవ్వలేదన్నారు. భూసేకరణ సమయానికి ఇంట్లో ఉన్న మేజర్లకు మాత్రమే ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ చెల్లిస్తామని చెబుతున్నారని, ఇది సమంజసం కాదన్నారు. పదేళ్లక్రితమే భూములు స్వాధీనం చేసుకున్నట్టు నష్టపరిహారం చెల్లించారని, అప్పట్లో మైనర్లయిన వారంతా ఇప్పుడు మేజర్లయ్యారని, వీరిని పరిగణలోకి తీసుకోవాలని కోరారు. ప్రస్తుతం చేస్తున్న సర్వే లోపభూయిష్టంగా ఉందని, గతంలో పరిహారం చెల్లించిన భూములు, ఇళ్ల వద్దే సర్వే చేస్తున్నారని, అన్యాయం జరిగిన రైతులు, పరిహారం అందని నిర్వాసితులను సర్వేచేయడం లేదని ఆరోపించారు. ఈసమావేశంలో సర్పంచ్‌లు భార్గవ్, ఎంపీటీసీ తిరుపతిరావు, ఉప సర్పంచ్ గబ్బర్ సింగ్, మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు శీరం నర్సింహమూర్తి,వైఎస్సార్‌సీపీ నాయకులు గొర్ల బాబూరావు, యలమంచిలి తాతబాబు, సీపీఎం మండల కన్వీనర్ మనబాల రాజేష్, రైతు నాయకులు రావి ఈశ్వరరావు, పిక్కి అప్పారావు, ఎరిపల్లి నాగేష తదితరులు పాల్గొన్నారు.

'స్మార్ట్ మీటర్లపై మాట తప్పిన టీడీపీ'



మాట్లాడుతున్న వెంకన్న

దేవరాపల్లి: విద్యుత్ స్మార్ట్ మీటర్లపై టీడీపీ మాట తప్పిందని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు డి.వెంకన్న విమర్శించారు. మండల కేంద్రం దేవరాపల్లిలో ఆదివారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడారు. స్మార్ట్ మీటర్ల విషయంలో ప్రతిపక్షంలో ఉన్నప్పుడు వ్యతిరేకించిన టీడీపీ.. నేడు అధికారంలోకి వచ్చాక కొనసాగిస్తుండటం దారుణమన్నారు. ఇది ప్రజలను, రైతులను మున్మాటికీ మోసగించడమేనని స్పష్టం చేశారు. స్మార్ట్ మీటర్లను వ్యతిరేకిస్తూ హైకోర్టులో టీడీపీ పిటిషన్లు సైతం వేసిందన్నారు. అధికారంలోకి వచ్చాక వాటిని రద్దు చేయకపోగా కేంద్ర ఆదేశాలకు తలొగ్గి నివాస గృహాలకు, వ్యవసాయ పంపు సెట్లకు స్మార్ట్ మీటర్లను బిగించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం వెనక అంతర్యమేమిటని ఆయన ప్రశ్నించారు. అదానీ, షిర్డీ సాయి కంపెనీలకు మీటర్ల పంపిణీ కాంట్రాక్ట్‌లను కట్టబెట్టారన్నారు. విశాఖపట్నం సహా పలు ప్రాంతాలలోని ప్రభుత్వ కార్యాలయాల్లో స్మార్ట్ మీటర్లను భద్రపరిచారన్నారు. వ్యవసాయానికి ఉచిత విద్యుత్‌కు ఎసరు పెట్టే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. నివాస గృహాలకు ప్రీపెయిడ్ మీటర్లను అమర్చడం ద్వారా టీవీ, సెల్‌ఫోన్ మాదిరిగా రీచార్జ్ చేయించుకోవాల్సి ఉంటుందని, తద్వారా ప్రజలపై అదనపు చార్జీల భారం పడుతుందన్నారు. మీటర్ల ఖర్చును సైతం వాయిదాల పద్ధతిలో వినియోగదారులపై భారం వేస్తారన్నారు. దౌర్జన్యంగా మీటర్లు బిగిస్తే ఎక్కడికక్కడ ప్రజలు అడ్డుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.

మహిళా కళాశాలలో పీజీ కోర్సుల్లో ప్రవేశాలు

దాబాగార్డెన్స్(విశాఖ): విశాఖ ప్రభుత్వ మహిళా కళాశాలలో 10 పీజీ కోర్సుల్లో ఏపీపీజీ సెట్ ద్వారా ప్రవేశాలు కల్పిస్తున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.మంజుల తెలిపారు. ఎంఏ ఇంగ్లిష్, ఎంఏ ఎకనామిక్స్, ఎంకామ్(కామర్స్), ఎమ్మెస్సీ మ్యాథమెటిక్స్, ఎమ్మెస్సీ ఫిజిక్స్, ఎమ్మెస్సీ కంప్యూటర్ సైన్స్, ఎమ్మెస్సీ ఆర్గానిక్ కెమిస్ట్రీ, ఎమ్మెస్సీ బోటనీ, ఎమ్మెస్సీ మైక్రోబయాలజీ, ఎమ్మెస్సీ సైకాలజీ కోర్సుల్లో ప్రవేశాలకు https://pgcetsche.apotnine.in/APP-GCET ద్వారా వెబ్ ఆప్షన్లు ఇవ్వాలని కోరారు. మరిన్ని వివరాలకు 7780168423, 7032270810 నంబర్లలో సంప్రదించాలని ప్రిన్సిపాల్ మంజుల విజ్ఞప్తి చేశారు.

అంకుడు కర్రపై 'చిన్ని కృష్ణుడు'

ఏటికొప్పాక కళాకారిణి నైపుణ్యం



అంకుడు కర్రపై రూపుదిద్దుకున్న సూక్ష్మ గోపాలుడు (ఇన్‌సెట్) లావణ్య

యలమంచిలి రూరల్: మండలంలోని ఏటికొప్పాక పేరు చెప్పగానే ఖండాంతర ఖ్యాతి చెందిన లక్కబొమ్మలు గుర్తుకొస్తాయి. ఎన్నో అసాధ్యాలను సైతం సుసాధ్యాలు చేయగల కళానైపుణ్యత ఏటికొప్పాక హస్త కళాకారుల సొంతమని చెప్పాలి. సందర్భానుసారం ఈ గ్రామానికి చెందిన హస్తకళాకారులు తమ సృజనాత్మకతను చాటుకుంటూ కళాభిమానులను ఆశ్చర్యపరుస్తున్నారు. ఈ గ్రామానికి చెందిన హస్తకళా కార్మికురాలు (కళాకారిణి) చింతల లావణ్య శ్రీ కృష్ణాష్టమి వేడుకలను పురస్కరించుకుని ఒక చిన్న అంకుడు కర్ర ముక్కపై అతి సూక్ష్మమైన గోపాలుడి రూపాన్ని అద్భుతంగా తయారు చేశారు. 3.5 సెంటీమీటర్ల పొడవు, 2 సెంటీమీటర్ల వెడల్పున గోపాలుడి వేషధారణలో ఉన్న కృష్ణుడిని, ఆ వెనుక గోమాతను అద్భుతంగా చెక్కి ఔరా అనిపించారు. దీనిని తయారు చేయడానికి తనకు రెండు రోజుల సమయం పట్టిందని లావణ్య చెప్పారు. ఇటీవల వరలక్ష్మీ వ్రతాన్ని పురస్కరించుకుని ఆమె గోటిపై పట్టేంత అతి చిన్న సైజులో లక్ష్మీదేవి బొమ్మను అంకుడు కర్రతో తయారుచేశారు. గతంలో కూడా ఆమె పలు సూక్ష్మ కళాఖండాలు రూపొందించారు.



ఆర్మీ ర్యాలీలో పేర్లు నమోదు కోసం క్యూలో నిల్చున్న అభ్యర్థులు

ఆర్మీ ర్యాలీకి వేళాయె

సాక్షి, విశాఖపట్నం: అగ్నివీర్ నియామక ప్రక్రియలో భాగంగా సోమవారం నుంచి పోర్టు స్టేడియంలో భారీ ఆర్మీ ర్యాలీ ప్రారంభం కానుంది. సెప్టెంబర్ 5 వరకూ ఈ నియామక ప్రక్రియకు సంబంధించిన వివిధ రకాల పరీక్షలు నిర్వహించనున్నారు. శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లా, తూర్పుగోదావరి, కోనసీమ, కాకినాడ, ఏలూరు, పశ్చిమగోదావరి, కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాలకు చెందిన అభ్యర్థులు ఆదివారం రాత్రి నుంచి పోర్టు స్టేడియం వద్దకు చేరుకున్నారు.



విశ్రాంతి తీసుకుంటున్న ఆర్మీ ర్యాలీ అభ్యర్థులు

చట్టాలను పక్కాగా అమలు చేయాలి



స్వాతంత్ర్యం వచ్చి 70 సంవత్సరాలు పూర్తి అయినా సరే మహిళలకు రక్షణ కరువైంది. ప్రధానంగా మహిళా వైద్య ఉద్యోగుల పట్ల ప్రభుత్వాలు ప్రత్యేకంగా చట్టాలను చేసి పక్కాగా అమలు చేయాలి. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, కమ్యూనిటీ ఆస్పత్రుల్లో పనిచేసే వైద్యాధికారులు, ఇతర సిబ్బందికి విశ్రాంత గదులు, సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలి. మహిళా ఉద్యోగులకు భద్రత పెంచాలి.

–డాక్టర్ కె.లీలాప్రసాద్, వైద్యాధికారి, కేజే పురం, మాడుగుల మండలం

ఉద్యోగుల భద్రతపై ప్రత్యేక శ్రద్ధ



విమ్స్ ఆస్పత్రిలో పనిచేస్తున్న సిబ్బందికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా వారి భద్రతపై ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నాం. రాత్రి సమయంలో సెక్యూరిటీని పెంచడంతో పాటు సాయంత్రం 5 గంటల తర్వాత ప్రధాన ముఖద్వారం మినహా మిగిలిన అన్ని గేట్లను మూసివేస్తున్నాం. రాత్రి సమయంలో విధుల్లో ఉన్న సిబ్బందిపై రోగులు గానీ, వారి బంధువులు గానీ దాడులు చేయకుండా క్యాజువాలిటీ దగ్గర ప్రత్యేక భద్రతను ఏర్పాటు చేశాం.

– డాక్టర్ కె.రాంబాబు, డైరెక్టర్, విమ్స్

క్లుప్తంగా

జిల్లా స్థాయి వక్తృత్వ పోటీల్లో ప్రతిభ



ప్రతిభ చూపిన కింతలి హైస్కూలు విద్యార్థినులు

మాడుగుల రూరల్: వరదా ఫౌండేషన్ స్వచ్ఛంద సంస్థ అనకాపల్లిలో శనివారం నిర్వహించిన జిల్లా స్థాయి వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో కింతలి హైస్కూలు విద్యార్థులు ప్రతిభ చూశారు. అనకాపల్లి జీవీఎంసీ పాఠశాలలో నిర్వహించిన ఈ పోటీల్లో 14 మండలాలకు చెందిన 90 మంది విద్యార్థినీవిద్యార్థులు పాల్గొన్నారు. కింతలి హైస్కూల్‌కు చెందిన కె.లిఖిత(9వ తరగతి), డి. ప్రత్యూష, ఎం.రమ్యశ్రీ (10వ తరగతి) ఆంగ్ల వక్తృత్వ పోటీల్లో విజేతలుగా నిలిచారని, వీరు త్వరలో జరిగే రాష్ట్రస్థాయిలో జరిగే పోటీలల్లో పాల్గొంటారని ఎంఈవో దేముడమ్మ తెలిపారు.

స్వాగతం కృష్ణా... శరణాగతం కృష్ణా..



ప్రత్యేక అలంకరణలో రాధాకృష్ణులు

ఎంవీపీకాలనీ (విశాఖ): హరేకృష్ణ మూవ్‌మెంట్ ఆధ్వర్యంలో ఎంవీపీకాలనీలోని గాదిరాజు ప్యాలెస్‌లో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. గాదిరాజు ప్యాలెస్‌లో తీర్చిదిద్దిన భారీ సెట్‌లో ఆదివారం రాధాకృష్ణులను ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. సప్తనదుల జలాలు, పంచామృతం, పండ్ల రసాలు, 108 పవిత్ర జల కలశాలతో అభిషేకం చేపట్టారు. బృందావనం నుంచి వచ్చిన లడ్డూ గోపాలుడికి మృదువైన ఉయ్యాల సేవ చేశారు. ప్రసిద్ధ సంగీత కళాకారులతో సామూహిక భజగోవిందం, 108 సార్లు హరి నామ జపం జరిగాయి. వంకాలయ శృతి, శారద సుబ్రహ్మణ్యం గుమ్ములూరి, డాక్టర్ ద్వారం త్యాగరాజ్ బృందాలు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

సిద్ధి వినాయకులు సిద్ధం

- ఆకట్టుకున్న వినాయక విగ్రహాలు
- కనువిందైన రంగులతో ముస్తాబు
- పలువురికి ఉపాధి నిస్తున్న మట్టి బొమ్మల తయారీ
- జిల్లాలో 12 వినాయక విగ్రహాల తయారీ కేంద్రాలు
- ప్రత్యక్షంగా పరోక్షంగా 300 కుటుంబాలకు ఆధారం



మాడుగుల ఘాట్‌రోడ్‌లో వినాయక విగ్రహాలకు రంగులు అద్దుతున్న తయారీదారులు

మాడుగుల: సిల్వర్ కుండలు, అందుబాటులోకి వచ్చిన తర్వాత కుమ్మరులు తయారు చేసే మట్టి కుండలు కనుమరుగవుతున్నాయి. దీంతో జిల్లా వ్యాప్తంగా మట్టి కుండలు తయారు చేసే వారు వందలాది కుటుంబాలు జీవనోపాధి కోల్పోయారు. దీంతో ప్రత్యామ్నాయంగా పలువురు, వినాయక విగ్రహాలు, దేవీ విగ్రహాలు, బొమ్మల తయారీపై దృష్టి సారించారు. జిల్లాలో మాడుగుల మండలం ఘాట్‌రోడ్ జంక్షన్, కె.కోటపాడు మండలం చౌడువాడ, హరిపాలెం, రావికమతం మండలం కొత్తకోట, అనకాపల్లి, తుంపాల, బుచ్చయ్యపేట, మండలం వడ్డాదితో పాటు మరో 5 కేంద్రాల్లో వినాయక విగ్రహాలు ఏటా తయారు చేస్తున్నారు. వచ్చే నెల 7 వ తేదీ నుంచి జరగనున్న వినాయర నవరాత్రులకు నాలుగు నెలలు ముందు వినాయక విగ్రహాల తయారీకి సిద్ధం అవుతారు. బొమ్మల తయారీతో పాటు వివిధ రకాలు రంగుల రూపకల్పనకు అనేక మంది అవసరమవుతుంటారు. దీంతో సుమారు 300 కుటుంబాలకు ఏటా జీవనోపాధి దొరుకుతుందని, తయారీదారులు చెబుతున్నారు. ఇక్కడ తయారు చేసిన విగ్రహాలు ఇతర జిల్లాలైన పాడేరు, అరకు, తదితర జిల్లాలకు కూడా ఎగుమతి అవుతుంటాయి. వినాయక విగ్రహాల తయారీ వల్ల చిన్న చిన్న వ్యాపారులు కూడా నాలుగు రూపాయలు కూడదీసుకుంటారు. విగ్రహాలు పెయింటర్స్‌కు కూడా ఈ సమయాల్లో పూర్తి స్థాయిలో పని దొరుకుతుంది. ముఖ్యంగా ఘాట్‌రోడ్డు జంక్షన్‌లో వివిధ రకాల వాహనాలపై వినాయకుడు ఆసీనులైనట్లు తీర్చిదిద్దిన విగ్రహాలకు రంగులు అద్దడంతో చూపరులను ఎంతో ఆకట్టుకుంటున్నాయి.

పదేళ్లుగా ఇదే వృత్తి

పదేళ్లుగా ఇదే వృత్తిలో జీవనం సాగిస్తున్నాను. నాలుగు నెలలు వినాయక విగ్రహాల తయారీలో ఉంటాం. విగ్రహాలకు అద్దే రంగులు దగ్గర నుంచి వివిధ రకాల మెటీరియల్‌కు ధరలు పెరిగిపోయాయి. కానీ విగ్రహాలకు ధరలు రాలేదు. మట్టి కుండలు వాడకం తగ్గిపోవడంతో ఈ వృత్తిలోకి వచ్చాం. వినాయక విగ్రహాలు, దేవీ విగ్రహాలు తయారీ చేస్తాం. మిగిలిన సమయాల్లో మట్టి బొమ్మలు తయారు చేస్తూ మనుగడ సాగిస్తున్నాం. ఈ పరిశ్రమకు ప్రభుత్వం రాయితీపై రుణాలు అందజేసి ఆదుకోవాలి.

–శ్రీకాకుళపు నాగరాజు, ఘాట్‌రోడ్ జంక్షన్

యాజమాన్యాల నిర్లక్ష్యమే ఫార్మా ప్రమాదాలకు కారణం

- సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సింగరావు
- మూలజంపలో ఫార్మా మృతుని కుటుంబానికి పరామర్శ



బాధిత కుటుంబాలతో మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సింగరావు

రాంబిల్లి(యలమంచిలి): తరచూ ఫార్మా పరిశ్రమల్లో ప్రమాదాలు జరగడానికి ఆయా పరిశ్రమల యాజమాన్యాల నిర్లక్ష్యమే కారణమని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు విమర్శించారు. ఎసైన్షియా ఫార్మా పరిశ్రమలో ఇటీవల జరిగిన ప్రమాదంలో మృతి చెందిన మూలజంప గ్రామానికి చెందిన కార్మికుడు వేగి సన్యాసినాయుడు కుటుంబాన్ని ఆదివారం ఆయన సీఐటీయూ నాయకులతో కలిసి పరామర్శించారు. ఈ సందర్భంగా నర్సింగరావు మాట్లాడుతూ ఎస్ఈజెడ్ ఏర్పడిన తర్వాత ఇదే పెద్ద ప్రమాదమన్నారు. కంపెనీ యాజమాన్యాలకు తమ లాభాలు తప్ప, కార్మికుల ప్రాణాలు అంటే లెక్కలేదన్నారు. ఇప్పటికైనా ఘోర ప్రమాదానికి కారణమైన కంపెనీ యాజమాన్యంపై చర్యలు తీసుకుని, అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.కోటేశ్వరరావు, జిల్లా ఉపాధ్యక్షులు జి.దేముడునాయుడు, ఆర్.రాము, కూండ్రపు సోమునాయుడు, ఎస్ఈజెడ్ నిర్వాసితుల సంఘం నాయకులు బుద్ధ రంగారావు, ఆర్.రాంబాబు, మూలజంప గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

'బాబు జీవోతో నిలిచిన తనిఖీలు'

మునగపాక(అచ్యుతాపురం): అచ్యుతాపురం సెజ్ పరిధిలోని ఫార్మా కంపెనీలో జరిగిన ప్రమాదంపై న్యాయ విచారణ జరిపించాలని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్.నర్సింగరావు డిమాండ్ చేశారు. స్థానిక జూనియర్ కళాశాలలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబు అవలంబిస్తున్న విధానాల వల్ల కంపెనీల్లో ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. గతంలో బాబు ముఖ్యమంత్రిగా పనిచేసిన సమయంలో కంపెనీల్లో తనిఖీలు నిర్వహించకుండా తీసుకువచ్చిన జీవో కారణంగా కంపెనీ యాజమాన్యాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని చెప్పారు. తక్షణమే సంబంధిత జీవోను రద్దు చేయాలన్నారు. ఈ నెల 28న రాష్ట్ర స్థాయిలో కార్మిక యూనియన్లతో నిరసన కార్యక్రమం చేపట్టనున్నామన్నారు.

విద్యుత్ షాక్‌తో బాలుడి మృతి



అక్కిరెడ్డిపాలెం (విశాఖ): మేడపై జీఏ వైరుతో ఆడుకుంటున్న బాలుడు విద్యుత్ షాక్‌కు గురై.. చికిత్స పొందుతూ మృతి చెందాడు. గాజువాకలోని ఆర్‌హెచ్ కాలనీలో ఈ ఘటన చోటు చేసుకుంది. గాజువాక సీఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాలివీ.. విజయనగరం జిల్లా గుర్ల మండలం గవిడిపేటకు చెందిన గవిడి త్రినాథరావు, భార్య, ఇద్దరు పిల్లలు గవిడి దీక్షిత్, దీపేష్(9)తో గాజువాక శ్రీనగర్ దిబ్బపాలెం, ఆర్‌హెచ్‌కాలనీలో నివాసం ఉంటున్నారు. 20 ఏళ్ల నుంచి స్టీల్‌ప్లాంట్‌లో ఎల్ఎంఎంఎం క్యాంటీన్‌లో వర్కర్‌గా పనిచేస్తున్నాడు. కాగా.. ఆదివారం అతని చిన్న కుమారుడు దీపేష్ ఇంటి మేడపై జీఏ వైర్‌తో ఆడుకుంటున్నాడు. ఈ క్రమంలో హై టెన్షన్ వైరుకు జీఏ వైరు తగిలి విద్యుత్ షాక్‌కు గురై పడిపోయాడు. ఇది గమనించిన దీపేష్ బంధువు గట్టిగా కేకలు వేశాడు. వెంటనే దీపేష్‌ను అతని తండ్రి దగ్గరలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా.. అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం నగరంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ బాలుడు మృతి చెందాడు. త్రినాథరావు ఫిర్యాదు మేర కు కేసు దర్యాప్తు చేపడుతున్నట్టు సీఐ శ్రీనివాసరావు తెలిపారు.

యువకుడిని కబళించిన రోడ్డు ప్రమాదం



శ్రీనివాసరావు(ఫైల్)



కనకల శ్రీనివాసరావు మృతదేహాన్ని పట్టుకుని రోదిస్తున్న కుటుంబ సభ్యులు

పద్మనాభం (విశాఖ): చేతికి అందివచ్చిన కొడుకు అనంత లోకాలకు వెళ్లిపోవడంతో ఆ తల్లిదండ్రుల శోకానికి అవధులు లేకుండా పోయింది. స్థానిక పోలీసులు తెలిపిన వివరాలివి. విశాఖ జిల్లా ఆనందపురం మండలం బోని గ్రామానికి చెందిన కనకల శ్రీనివాసరావు (36) పని మీద శనివారం ద్విచక్ర వాహనంపై విజయనగరం వెళ్లాడు. పని ముగించుకుని అదే రోజు రాత్రి 10 గంటల సమయంలో ద్విచక్ర వాహనంపై బోని వస్తుండగా మార్గం మధ్యలో రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. అనకాపల్లి జిల్లా కె.కోటపాటు మండలం ఆర్.వి.అగ్రహారానికి చెందిన లెక్కల సతీష్ భార్య శ్రీవల్లికతో కలిసి ద్విచక్రవాహనంపై వస్తూ పద్మనాభం మండలం విజయానందపురం జంక్షన్ వద్ద చెరువుకు సమీపంలో శ్రీనివాసరావును ఢీకొట్టాడు. అతడి తలకు బలమైన గాయాలవ్వడంతో 108 అంబులెన్స్‌లో విజయనగరం మహారాజా ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తీసుకెళ్లారు. అప్పటికే శ్రీనివాసరావు మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. ఈ ప్రమాదంలో సతీష్, శ్రీవల్లిక దంపతులకు గాయలవ్వడంతో అదే ఆస్పత్రిలో చేర్పించారు. సతీష్ పరిస్థితి విషమంగా ఉండడంతో విశాఖపట్నం కేజీహెచ్‌కు తరలించి వైద్యం అందిస్తున్నారు. ఈ ఘటనపై అందిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు పద్మనాభం పోలీసులు తెలిపారు.

27న బార్క్ డైరెక్టర్ రాక

మహారాణిపేట : బాబా ఆటోమెటిక్ రీసెర్చ్ సెంటర్ డైరెక్టర్ వివేక్ భాసిన్ ఈనెల 27న విశాఖ వస్తున్నారు. నరసింహనగర్‌లో ఉన్న బార్క్‌కు చేరుకొని అక్కడ బస చేస్తారు. 28న అచ్యుతాపురం వెళ్తారు.

ఆక్రమణ తొలగింపుపై వివాదం

- ఇంటిని తొలగించవద్దంటూ అడ్డుకున్న ఓ కుటుంబం
- కోర్టు తీర్పుతోనే తొలగింపు చర్యలు చేపట్టామంటున్న పంచాయతీ అధికారులు
- మధ్యలో నిలిచిన తొలగింపు ప్రక్రియ



నాగలక్ష్మి ఇంటి వద్ద పోలీసు బందోబస్తుతో పంచాయతీ సిబ్బంది

చోడవరం: పట్టణంలో పంచాయతీ అధికారులు చేపట్టిన ఆక్రమణల తొలగింపు వివాదాస్పదమైంది. పట్టణంలో రోడ్ల విస్తరణలో పలు ప్రాంతాల్లో ఆక్రమణలను తొలగించే పనిని పంచాయతీ అధికారులు ఆదివారం చేపట్టారు. దీనిలో భాగంగా వినాయకుడి గుడి ఎదురుగా ఉన్న కొత్త థియేటర్ల రోడ్డులో ఆక్రమణల తొలగింపు చేపట్టారు. పొక్లెయిన్‌తో ఆక్రమణలు తొలగించేందుకు సిద్ధమైన సమయంలో ఆక్రమణదారులు అడ్డుపడడంతో వివాదం జరిగింది. చాలా దశాబ్దాల నుంచి ఈ స్థలంలో తాము ఇల్లు కట్టుకొని నివాసం ఉంటున్నామంటూ నాగలక్ష్మి అనే మహిళ తన కుటుంబ సభ్యులతో అడ్డుపడ్డారు. దీంతో పోలీసులు రంగంలోకి దిగారు. ఎస్ఐలు శేఖరం, సూర్యనారాయణ మహిళాపోలీసులతోపాటు పెద్దసంఖ్యలో బందోబస్తు ఏర్పాటు చేశారు. అయినా నాగలక్ష్మి కుటుంబసభ్యులు ఇంట్లో నుంచి బయటకు రాకుండా ఇది తమ సొంత స్థలమని, తాము పడగొట్టడానికి అంగీకరించమంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. వారిని బయటకు తీసుకొచ్చేందుకు పోలీసులు, పంచాయతీ సిబ్బంది చేసిన ప్రయత్నం విఫమవడంతో తొలగింపు ప్రక్రియను తాత్కాలికంగా నిలిపివేశారు. ఇదిలావుండగా ఆక్రమణలపై గత ఏడాది నాగలక్ష్మితోపాటు అందరికీ నోటీసులు ఇచ్చామని పంచాయతీ కార్యదర్శి నారాయణరావు చెప్పారు. అయితే నాగలక్ష్మి కోర్టుకు వెళ్లడంతో ఇప్పటి వరకూ నిలిపివేశామని, గతనెలలో కోర్టు పంచాయతీకి అనుకూలంగా తీర్పు ఇచ్చిందని, ఇక్కడ ఉన్న ఇంటికి సంబంధించి నాగలక్ష్మికి 70గజాలు వరకూ పట్టాభూమి ఉందని, కాని ఇళ్లు 130 గజాల వరకూ ఉండటంతో మిగతాది పంచాయతీ స్థలంగా గుర్తించడం జరిగిందన్నారు. ఆ ఆక్రమణలో కొంత స్థలాన్ని రోడ్డు, కాల్వ విస్తర్ణ కోసం తొలగిస్తున్నామని కార్యదర్శి చెప్పారు. తొలగింపునకు సంబంధించి గత నెలలో నోటీసులు కూడా ఇచ్చామన్నారు. పక్కన ఉన్న అన్నీ తొలగిస్తున్నామని, అందులోభాగంగానే నాగలక్ష్మి ఇంటిని కూడా తొలగించేందుకు చర్యలు చేపట్టామన్నారు. ఇదిలావుండగా తమ పై కక్షసాధింపుగానే ఇంటిని తొలగిస్తున్నారని, కేసు కోర్టులో ఉండగా ఎలా తొలగిస్తారంటూ నాగలక్ష్మి కుటుంబసభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. తమపై కొందరు కక్షకట్టి ఇలా చేయిస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ వివాదంతో ఆక్రమణల తొలగింపు ప్రక్రియ నిలిచిపోయింది.

నదిలో రైతు గల్లంతు



రైతు పోతురాజు (ఫైల్)



నదిలో గాలిస్తున్న ఫైర్ సిబ్బంది, గజ ఈతగాళ్లు

కోటవురట్ల: సరుగుడు మొక్కలు ఎలా ఉన్నాయో చూసేందుకు పొలానికి బయలు దేరిన ఓ రైతు వరాహనదిని దాటుతూ గల్లంతయ్యాడు. ఆదివారం ఉదయం 6 గంటల సమయంలో జరిగిన ఈ ఘటన రైతు స్వగ్రామం కొత్త గొట్టివాడలో విషాదాన్ని నింపింది. వివరాల్లోకి వెళితే.. కొత్త గొట్టివాడ గ్రామానికి చెందిన సుంకర పెద పోతురాజు(60) ఆదివారం ఉదయం 6 గంటలకు పందూరు దగ్గరలో ఉన్న పొలానికి సైకిల్‌పై బయలుదేరాడు. రామచంద్రపురం జంక్షన్ మీదుగా వెళ్లి పందూరు వరాహనదిని దాటేందుకు సైకిల్‌ను భుజాన వేసుకుని నదిని దాటుతుండగా ప్రమాదవశాత్తు జారిపడి కొట్టుకుపోయాడు. గమనించిన స్థానికులు నదిలోకి దిగి గాలించినా ఫలితం లేకపోయింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు, ఫైర్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ఎస్ఐ రమణయ్య ఆధ్వర్యంలో పోలీసులు, ఫైర్ సిబ్బంది, గజ ఈతగాళ్లు సుమారు పది మంది గాలించారు. జారిపడిన ప్రాంతం నుంచి సుమారు 3 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఇందేశమ్మవాక వరకు నదిలో గాలించారు. సుమారు పది గంటల పాటు శ్రమించినా ఆచూకీ లభించలేదు. నదిలో పలు చోట్ల ఊబులు ఉండడం, బాగా లోతుగా ఉండడం వల్ల గాలింపు కష్టంగా ఉన్నట్టు ఎస్ఐ తెలిపారు. సోమవారం ఉదయం మళ్లీ గాలింపు చర్యలు చేపట్టనున్నట్టు ఎస్ఐ తెలిపారు. ఎస్.రాయవరం మండలం దార్లపూడి వంతెన వరకు గాలించాల్సి ఉంటుందని, ఇందుకు మరింత మంది ఈతగాళ్లు అవసరం ఉంటుందని తెలిపారు. గల్లంతై పది గంటలు దాటినా ఆచూకీ లభ్యం కాకపోవడంతో కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

విశాఖలో ప్రమాదం..కశింకోట వాసి మృతి

పీఎం పాలెం (విశాఖ): గుర్తు తెలియని ఓ ఆటో డ్రైవర్ నిర్లక్ష్యంగా ఆటో నడిపి ఒక వ్యక్తి మృతికి కారకుడయ్యాడు. ఈ ఘటనకు సంబంధించి విశాఖపట్నం పీఎం పాలెం పోలీస్ స్టేషన్ సీఐ వై.రామకృష్ణ తెలిపిన వివరాలివి. అనకాపల్లి జిల్లా కశింకోటకు చెందిన పగడాల రమణ(50) అనే వ్యక్తి విశాఖ నగరంలోని పెట్రోల్ బంకుల వద్ద జరిగే పనుల్లో కూలీగా చేస్తుంటాడు. ఈ నెల 23వ తేదీ సాయంత్రం 5.30 గంటల సమయంలో సహచర కూలీ దాస్‌తో కలిసి కొమ్మాది నుంచి కార్‌షెడ్ కూడలికి వచ్చే ఆటో ఎక్కాడు. డ్రైవర్ నిర్లక్ష్యంగా ఆటో నడపడంతో పగడాల రమణ కిందకు పడిపోయాడు. తలకు తీవ్రమైన గాయం కావడంతో అధికంగా రక్తస్రావం జరిగి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. ఆటో డ్రైవర్ క్షతగాత్రుడిని కనీసం పట్టించుకోకుండా సంఘటన స్థలం నుంచి పరారయ్యాడు. రమణను వెంటనే వైద్యం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించగా అప్పటికే మరణించినట్టు వైద్యులు ధ్రువీకరించారు. విషయం తెలుసుకున్న మృతుడి కుమార్తె నీలిమ శనివారం రాత్రి పీఎం పాలెం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ రామకృష్ణ తెలిపారు.

మానవతావాది సింహాద్రప్పడు

మురళీనగర్ (విశాఖ): ఉపాధ్యాయ ఉద్యమ సింహం దివంగత గుల్లిపల్లి సింహాద్రప్పడు గొప్ప మానవతావాది అని వక్తలు కొనియాడారు. ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మాధవధార మాధవస్వామి కల్యాణ మండపంలో ఆదివారం సింహాద్రప్పడు సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీలు వేపాడ చిరంజీవిరావు, పాకలపాటి రఘువర్మ, ఏపీటీఎఫ్ రాష్ట్ర పూర్వ కార్యదర్శి పాండురంగ వరప్రసాద్ మాట్లాడారు. ఉపాధ్యాయులు, ఉద్యోగుల హక్కులను కాపాడుకుంటూనే బాధ్యతల కోసం నిలబడతామని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య ను అందించేందుకు సింహాద్రప్పడు నిరంతరం కృషి చేశారని వారు చెప్పారు.

'ఎసైన్షియా'ను సందర్శించిన యలమంచిలి సివిల్ జడ్జి



ప్రమాదం జరిగిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న యలమంచిలి సివిల్ జడ్జి విజయ

రాంబిల్లి(యలమంచిలి): రాంబిల్లి మండలం ఎసైన్షియా ఫార్మా పరిశ్రమలో ఇటీవల జరిగిన ప్రమాద స్థలాన్ని యలమంచిలి సివిల్ జడ్జి పి.విజయ శనివారం సాయంత్రం సందర్శించారు. రాష్ట్ర న్యాయ సేవా అధికార సంస్థ, జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆదేశాల మేరకు ఫార్మా పరిశ్రమలో జరిగిన ప్రమాదస్థలిని ఆమె అధికారులతో కలసి పరిశీలించారు. ప్రమాద వివరాలను ఫ్యాక్టరీ సీనియర్ మేనేజర్ సంజయ్‌కుమార్, అధికారులను ఆమె అడిగి తెలుసుకున్నారు. ఈ ఘటనలో మృతి చెందిన బాధిత కుటుంబాల ఇళ్లకు వెళ్లి పరామర్శించారు. అనకాపల్లి ఉషాప్రైమ్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. బాధిత కుటుంబాలకు నష్టపరిహారం అందిందా? లేదా? అని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఫ్యాక్టరీస్ ఆఫ్ ఇన్‌స్పెక్టర్, పొల్యూషన్ బోర్డు అధికారులు, లేబర్ కమిషనర్, రాంబిల్లి తహసీల్దార్, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

సీబీఆర్ఎన్ సెంటర్ ఏర్పాటులో కదలిక

- విశాఖలో వరుస ప్రమాదాల నేపథ్యంలో జోరు పెంచిన కేంద్ర ప్రభుత్వం
- గత ప్రభుత్వంలోనే విమ్స్‌లో స్థలం కేటాయింపు, అనుమతులు మంజూరు
- నెలాఖరున తుది పరిశీలనకు రానున్న కేంద్ర బృందం



స్థలాన్ని పరిశీలిస్తున్న కేంద్ర బృందం (ఫైల్)

బీచ్‌రోడ్డు: ఉమ్మడి విశాఖ జిల్లాలో వరుసగా అగ్ని ప్రమాదాలు చోటుచేసుకున్న నేపథ్యంలో విమ్స్‌లో కెమికల్, బయోలాజికల్, రేడియోలాజికల్ అండ్ న్యూక్లియర్ (సీబీఆర్ఎన్) మెడికల్ మేనేజ్‌మెంట్ సెంటర్ ఏర్పాటులో కదలిక వచ్చింది. పరిశ్రమల్లో జరిగే అగ్నిప్రమాదాల్లో క్షతగాత్రులకు మెరుగైన వైద్యం ఒకే చోట అందించేందుకు కేంద్ర ప్రభుత్వం గత ఏడాది దేశ వ్యాప్తంగా పది సీబీఆర్ఎన్ కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు వైద్య సంస్థలను ఎంపిక చేసింది. అందులో తెలుగు రాష్ట్రాల నుంచి విశాఖలోని విమ్స్ ఆసుపత్రి ఒకటి. దీనిపై అప్పటి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వెంటనే స్పందించి సెంటర్ ఏర్పాటుకు కావలసిన రెండు ఎకరాల స్థలాన్ని కేటాయించింది. అంతేకాకుండా సెంటర్‌కు అనుమతులను కూడా జారీ చేసింది.

తుది పరిశీలనకు రానున్న కేంద్ర బృందం

అప్పటి ప్రభుత్వం స్థలం కేటాయించడంతోపాటు అన్ని అనుమతులను మంజూరు చేయడంతో ఈ ఏడాది ఫిబ్రవరిలో కేంద్ర ప్రభుత్వ ఆరోగ్యశాఖ సీనియర్ ప్రాంతీయ సంచాలకులు అనురాధ ఆధ్వర్యంలో విమ్స్‌లో స్థలాన్ని పరిశీలించారు. తుది పరిశీలన కోసం ఈ నెల 28, 29 తేదీల్లో కేంద్ర, రాష్ట్ర నిపుణుల బృందం రానుంది. ఈ పరిశీలన పూర్తయితే సెంటర్ ఏర్పాటుకు మార్గం సుగమమైనట్టే.

కార్పొరేట్ ఆసుపత్రులకు స్వస్తి చెప్పవచ్చు

పరిశ్రమల్లో ప్రమాదాలు జరిగిన ప్రతీ సారి క్షతగాత్రులను చికిత్స నిమిత్తం కార్పొరేట్ ఆసుపత్రులకు తరలించాల్సి వస్తోంది. జిల్లాలో ఇటీవల పలు పరిశ్రమల్లో జరిగిన ప్రమాదాల్లో క్షతగాత్రులకు నగరంలోని పలు కార్పొరేట్ ఆసుపత్రుల్లో చికిత్స అందించారు. అదే సీబీఆర్ఎన్ సెంటర్ ఏర్పాటైతే క్షతగాత్రులందరిని ఒకే సెంటర్‌కు తరలించి మెరుగైన వైద్యం అందించవచ్చు.

ప్రత్యేక వసతులతో మెరుగైన వైద్యం

సీబీఆర్ఎన్ సెంటర్ ఏర్పాటు అనేది పూర్తిగా కేంద్ర ప్రభుత్వానికి సంబంధించినది. రెండు ఎకరాల స్థలంలో రెండు అంతస్తుల్లో ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తారు. చికిత్సకు వినియోగించే ప్రత్యేక సామగ్రి, పరికరాలను కేంద్ర ప్రభుత్వం కేటాయిస్తుంది. ప్రత్యేక శిక్షణ గల నిపుణులను ఇందులో నియమిస్తుంది. ఈ సెంటర్ ఏర్పాటు వల్ల ప్రమాదాల్లో తీవ్రంగా గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందుతుంది.

– డాక్టర్ కె.రాంబాబు, విమ్స్ డైరెక్టర్

క్లుప్తంగా

నూకాంబిక అమ్మవారికి ప్రత్యేక పూజలు



తులసిమాల అలంకరణలో నూకాంబిక అమ్మవారు

అనకాపల్లి : స్థానిక గవరపాలెం శ్రీ నూకాంబిక అమ్మవారిని శ్రావణమాసం మూడో ఆది వారం సందర్భంగా తులసిమాలతో ప్రత్యేకంగా అలంకరించారు. విశాఖ ఉమ్మడి జిల్లాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్ని అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయానికి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఈవో బండారు ప్రసాద్ ఉచిత ప్రసాద వితరణ వంటి కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఉద్యోగులు, భక్తులు పాల్గొన్నారు.

'బల్లా'కు విశిష్ట సేవా పురస్కారం



బల్లా నాగభూషణం

అనకాపల్లి : తెలుగు భాషా దినోత్సవ వేడుకలు ఈనెల 29న జరగనున్న సందర్భంగా విజయవాడ ఠాగూర్ స్మారక గ్రంథాలయంలో 'జాతీయ స్థాయి కళా, సామాజిక సేవా రంగం విశిష్ట అవార్డు' (గిడుగు రామమూర్తి) స్థానిక చిన్నరాజుపేటకు చెందిన సిద్ధార్థ సోషల్ సర్వీస్ అండ్ కల్చరల్ అసోసియేషన్ వ్యవస్థాపకుడు, విశ్రాంత జైల్ వార్డర్ బల్లా నాగభూషణంకు వచ్చింది. ఈ మేరకు ఆదివారం నాగభూషణం ఒక ప్రకటనలో ఈ విషయం పేర్కొన్నారు. 20 సంవత్సరాల క్రితం అసోసియేషన్ ఏర్పాటు చేసి పలు సేవా కార్యక్రమాలు చేయడం వల్ల ఈ అవార్డు దక్కడం ఎంతో ఆనందాన్ని కలిగించిందన్నారు. నేటి యువత సేవా కార్యక్రమాలపై దృష్టి సాధించాలని ఆయన కోరారు.

చురుగ్గా ఇంటింటి కుళాయి పనులు



గంగాదేవిపేటలో ఇంటింటికీ కొళాయి ఏర్పాటు పనులు

మునగపాక: గంగాదేవిపేటలో ఇంటింటి కుళాయిల ఏర్పాటు పనులు చురుగ్గా సాగుతున్నాయి. జలజీవన్ మిషన్ పథకంలో భాగంగా గ్రామంలో రూ.40 లక్షల వ్యయంతో ప్రస్తుతం పైప్‌లైన్ పనులు చేపడుతున్నారు. ఇందు కోసం 20 వేల లీటర్ల కెపాసిటీ కలిగిన రక్షిత మంచినీటి పథకాన్ని నిర్మిస్తున్నారు. పైప్‌లైన్ పనులు పూర్తి చేసి ఇంటింటికీ రక్షిత మంచినీరు అందించేందుకు అధికారులు చర్యలు చేపడుతున్నారు.

అనకాపల్లి సినిమాలు

పాగల్ V/r కాదల్	: రాజా(మార్నింగ్, మాట్నీ)
త్రిల్లర్ అండ్ చిల్స్	: రాజా(ఫస్ట్‌షో, సెకండ్‌షో)
తంగలాన్	: సత్యనారాయణ స్క్రీన్-1
కమిటీ కుర్రోళ్లు	: సత్యనారాయణ స్క్రీన్-2
సింబా	: పర్తిసాయి
మారుతీనగర్ సుబ్రమణ్యం	: షిర్డీసాయి
డబుల్ ఇస్మార్ట్	: వెంకటేశ్వర
మిస్టర్ బచ్చన్	: శ్రీసత్య
11 డిమోంటి కాలనీ	: రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లిటౌన్ : జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 20 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ నెగెటివ్-3 యూనిట్లు, బీ పాజిటివ్-5 యూనిట్లు, బీ నెగెటివ్-2 యూనిట్లు, ఓ పాజిటివ్-10 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంక్ ప్రతినిధి గంగయ్య(9182834480)ని సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లిటౌన్ : ఇండియన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా బుధవారం 323 మంది వినియోగదారులు గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న 291 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ (ఫోన్ నంబర్ 9441108144)ని సంప్రదించవచ్చు.

కఠిన శిక్షలతోనే అఘాయిత్యాలకు అడ్డుకట్ట



కోల్‌కతా వైద్యురాలిపై అఘాయిత్యానికి పాల్పడిన దోషులకు నెలరోజుల్లో శిక్ష పడినట్లయితే దేశంలో మరెక్కడా అటువంటి ఘటనలు జరగవు. రోగుల ప్రాణాలను నిలిపే వైద్యులతో పాటు వైద్య సిబ్బందిపై దేశంలో నిత్యం ఎక్కడో ఒక చోట దాడులు జరుగుతూనే ఉన్నాయి. ప్రాణం పోసే వైద్యులపై ఇటువంటి ఘటనలకు దిగితే వైద్యం ఎలా అందించాలి. పని చేసే చోట పోలీసు రక్షణ కల్పించాలి. రాత్రి విధులకు హాజరయ్యే వైద్యులు, వైద్య సిబ్బందికి వాహన సదుపాయం కల్పించాలి.

– స్వప్న సావిత్రమ్మ, ఏఎన్ఎం, 7వ సచివాలయం, వేల్పులవీధి

దోషులను కఠినంగా శిక్షించాలి



కోల్‌కతా వైద్యురాలిని హత్య చేసిన దోషులను కఠినంగా శిక్షించాలి. ప్రభుత్వం ప్రత్యేక చట్టం తెచ్చి ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలి. ఆస్పత్రుల్లో వైద్యులు, వైద్య సిబ్బందికి రక్షణ కల్పించాలి. ఆస్పత్రుల ఆవరణలో తప్పనిసరిగా పోలీస్ ఔట్‌పోస్టు ఏర్పాటు చేస్తే ఫలితం ఉంటుంది. అలాగే రాత్రి విధులు నిర్వర్తించే వైద్య ఉద్యోగుల రక్షణకు కూడా తగిన చర్యలు తీసుకోవాలి.

–ఎస్ఎం సుభాని, హెల్త్ అసిస్టెంట్, పీహెచ్‌సీ, కశింకోట.

శిథిల రహదారితో.. సమస్యలు

మండలంలోని నర్సీపట్నం వైపు నుంచి అచ్చెర్ల వెళ్లే పంచాయతీరాజ్ శాఖకు చెందిన తారు రోడ్డు గతుకులతో నిండి ఉంది. దీంతో నిత్యం నరకయాతన అనుభవించాల్సి వస్తోందని ప్రజలు, వాహన చోదకులు వాపోతున్నారు. గోతుల వల్ల తరచూ ప్రమాదాలకు గురి కావలసి వస్తోందని ఆవేదన చెందున్నారు. ఎన్నిసార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని, తమకు ఇబ్బందులు తప్పడం లేదని విమర్శిస్తున్నారు.



గతుకులతో నిండి ఉన్న అచ్చెర్ల వెళ్లే రోడ్డు



అచ్చెర్ల శివారు గమినిపేట వద్ద గోతులమయమైన రహదారి

- వర్షం పడితే గోతుల్లో నిండిపోతున్న నీరు
- చూడకుండా ప్రయాణిస్తే అంతే సంగతులు
- అచ్చెర్ల రోడ్డులో ప్రయాణం నరకం అంటున్న స్థానికులు

కశింకోట : తాళ్లపాలెం నుంచి నర్సీపట్నం వైపు వెళ్లే రోడ్డు కూడలి నుంచి అచ్చెర్లకు సుమారు ఐదు కిలోమీటర్ల దూరం ఉంటుంది. ఈ మార్గం మీదుగా జి. సింగవరం, కొత్త అచ్చెర్ల, గమినిపేట, మోసయ్యపేట, గోకివానిపాలెం గ్రామాలతో పాటు బుచ్చియ్యపేట మండలానికి చెందిన మల్లాం, చిన మల్లాం తదితర గ్రామాల ప్రజలు, వాహన చోదకులు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. సుమారు దశాబ్దం క్రితం భారీ వాహనాల తాకిడికి ఈ రోడ్డు గతుకులు పడి దెబ్బతింది. గమినిపేట, అచ్చెర్ల సమీపంలో పెద్ద గోతులు పడి ఉంది. ఏ మాత్రం వర్షం పడినా దానిలో నీరు నిల్వ ఉండిపోతోంది. దీంతో గోతులు కానరాక వాటిలో వాహనాలు పడి క్షతగాత్రులు కావలసి వస్తోందని వాహన చోదకులు వాపోతున్నారు. ఆటోలు, వాహనాలు మరమ్మతులకు గురవుతున్నాయని ఆవేదన చెందుతున్నారు. అత్యవసర పరిస్థితిలో సకాలంలో వైద్యానికి చేరుకోలేకపోతున్నామని రోగులు వాపోతున్నారు. రోడ్డుకు మరమ్మతులు చేయించాలని ఎన్నిసార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని విమర్శిస్తున్నారు. అయితే ఈ రోడ్డు మరమ్మతులకు గత ప్రభుత్వ హయాంలో నిధులు మంజూరు చేసింది. రూ. 50 లక్షలు మంజూరు కావడంతో అధికారులు నాలుగుసార్లు టెండర్లు పిలిచారు. అయితే ఎవరూ ముందుకు రాకపోవడంతో పనులు జరగలేదని అధికారిక సమాచారం.

రోడ్డును పునరుద్ధరించాలి..



నర్సీపట్నం వైపు నుంచి అచ్చెర్ల పోయే రోడ్డు దెబ్బతిని గోతులు పడింది. దీనివల్ల ఒక్కొక్కసారి వాహన చోదకులు పడి గాయాలపాలు కావలసి వస్తోంది. ఏ మాత్రం అజాగ్రత్తగా వెళ్లినా ప్రమాదం కొని తెచ్చుకునే పరిస్థితి ఉంది. దీని దృష్ట్యా గతుకులు పూడ్చి రోడ్డును పునరుద్ధరించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలి.

– శరగడం వెంకట రమణ, అచ్చెర్ల గ్రామం

అచ్చెర్ల రహదారి అధ్వానం



దశాబ్ద కాలంగా అచ్చెర్ల రోడ్డు అధ్వానంగా ఉంది. దీనివల్ల నిత్యం రోడ్డుపై రాకపోకలు సాగించడానికి నరకయాతన అనుభవించాల్సి వస్తోంది. గోతులు పూడ్చి రోడ్డు పునరుద్ధరించాలని ఎన్నిసార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదు. ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. ఇప్పటికైనా అధికారులు ఈ రోడ్డు పునరుద్ధరణకు చర్యలు తీసుకోవాలి.

– గొలగాని నాయుడు, అచ్చెర్ల గ్రామం

నిధులు మంజూరు కాగానే పనులు మొదలు పెడతాం..

అచ్చెర్ల కూడలి నుంచి అచ్చెర్లకు వెళ్లే రోడ్డు మరమ్మతులు చేసి పునరుద్ధరించడానికి రూ. కోటి 20 లక్షల అంచనాతో ప్రతిపాదనలు తయారు చేశాం. ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ ద్వారా ప్రభుత్వానికి నివేదించాం. నిధులు మంజూరు కాగానే రోడ్డు మరమ్మతులు చేపట్టడానికి చర్యలు తీసుకుంటాం. ఈ రోడ్డుకు దాదాపు రూ.50 లక్షలు మంజూరు కావడంతో నాలుగు దఫాలు టెండర్లు పిలిచాం. అయితే ఎవరూ ముందుకు రాకపోవడంతో పనులు జరగలేదు.

– ఎల్.సత్యనారాయణ, డీఈ, పంచాయతీరాజ్, అనకాపల్లి.

తక్షణమే శానిటేషన్ కార్మికుల జీతాలు చెల్లించాలి



మాట్లాడుతున్న సీఐటీయూ మహిళా విభాగం కార్యదర్శి జానకి

అనకాపల్లి : ప్రభుత్వ పాఠశాలల్లో శానిటేషన్ కార్మికుల సమస్యలపై సర్కారు తక్షణమే స్పందించాలని, ఈ ఏడాది మార్చి నుంచి బకాయి పడిన జీతాలు చెల్లించాలని స్కూల్ శానిటేషన్ జిల్లా (సీఐటీయూ) మహిళా విభాగం కార్యదర్శి జానకి అన్నారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో ఆదివారం జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. రకరకాల యాప్‌లు తీసుకొచ్చి మానసిక ఆవేదనకు గురి చేస్తున్నారని, బడుగు బలహీన వర్గాలకు చెందిన తమను రాజకీయంగా తొలగించేందుకు కూటమి నేతలు ప్రయత్నాలు చేస్తున్నట్లు చెప్పారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి గూనూరు వరలక్ష్మి మాట్లాడుతూ హైస్కూళ్లలో పని చేస్తున్న శానిటేషన్ కార్మికులు అధిక పని ఒత్తిడికి గురి అవుతున్నారని, వెయ్యి మంది వరకు ఉన్న పాఠశాలలు చాలా ఉన్నాయన్నారు. అలాంటి స్కూళ్లలో ఇద్దరు లేక ముగ్గురు పని వారిని నియమించి పని మొత్తం చేయాలని ఒత్తిడి చేస్తున్నట్లు తెలిపారు. ఏదైనా కష్టం వచ్చినప్పుడు కనీసం సెలవు కూడా ఇవ్వటం లేదని, పేద మహిళలు, ఒంటరి మహిళలు ఈ పథకంలో పని చేస్తున్నారని తెలిపారు. అలాంటిది నెలల తరబడి వేతనాలు ఇవ్వకపోతే ఏం తిని బ్రతకాలని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి వేతనాలు విడుదల చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు మణి, జానకి, నీలవేణి, వరలక్ష్మి, రాణి తదితరులు పాల్గొన్నారు.

రహదారిపై గోతులు పూడ్చాలి



చెరువును తలపిస్తున్న నాయుళ్ల వీధి రహదారి

అనకాపల్లి : పట్టణంలోని రహదారులు పెద్దపెద్ద గోతులతో ప్రయాణించాలంటే భీతిగొలిపేలా ఉన్నాయి. వర్షాలు కురిస్తే ఎక్కడ గొయ్యి ఉందో తెలియని పరిస్థితి. జిల్లా ప్రధాన కేంద్రంలో రహదారులు ఇలా ఉంటే కూటమి నేతలు కనీసం కన్నెత్తి కూడా చూడడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పట్టణ పరిధిలో సుంకరమెట్ట జంక్షన్, జలగల మధుం పెట్రోల్ బంకు వద్ద రహదారులు శిథిలం అయ్యాయి. ఈ రహదారిలో ప్రయాణించి వందలాది మంది వాహన చోదకులు క్షతగాత్రులయ్యారు. విజయరామరాజుపేట రైల్వే అండర్ బ్రిడ్జి, నాయుళ్లవీధి, రింగ్‌రోడ్డు మీదుగా వెళ్లే రహదారి గోతులతో నిండిపోయాయి. అలాగే తాగునీటి పైపులైన్ల కోసం తీసిన పెద్దపెద్ద గోతులను రెండు మాసాలుగా పూడ్చకపోవడంతో వర్షం పడితే గోతుల్లోకి వర్షపు నీరు చేరుతుంది. పెరుగుబజార్ జంక్షన్ నుంచి గాంధీ బొమ్మ జంక్షన్ వరకూ రహదారి విస్తరణ పనులు జరిగాయి. అయితే ఇక్కడ వర్షపు నీరు డ్రైనేజీలోకి వెళ్లే మార్గంలేక రహదారిపైనే ఆ నీరు నిల్వ ఉండిపోయి దోమల సంచారం ఎక్కువగా ఉంటుంది. కూటమి నేతలు పట్టణంలో కనీసం మూడు ప్రధాన రహదారులనైనా అభివృద్ధి చేయాలని చేయాలని ప్రజలు కోరుతున్నారు.

వైభవంగా షిర్డీసాయి ఆలయ వార్షికోత్సవం



అందంగా అలంకరించిన పల్లపు సోమవరంలోని షిర్డీ సాయిబాబా ఆలయం



ఊయల ఊగుతున్న వేంకటేశ్వరస్వామి, పద్మావతి, భూదేవి



వైద్యురాలు భవానీ కుచిపూడి నృత్యం



మహిళా బృందాల కోలాటాల ప్రదర్శన

కశింకోట : మండలంలోని పల్లపు సోమవరం గ్రామంలో షిర్డీ సాయిబాబా ఆలయ వార్షికోత్సవం అంగరంగ వైభవంగా ఆదివారం నిర్వహించారు. ఆలయ కమిటీ వ్యవస్థాపక చైర్మన్, గ్రామ మాజీ సర్పంచ్ గొంతిన శ్రీనివాసరావు, సర్పంచ్ గొంతిన నాగరత్నం ఆధ్వర్యంలో సాయిబాబా ఆలయాన్ని, గర్భ గుడిని పూల మాలలతో అందంగా అలంకరించారు. అనకాపల్లి, యలమంచిలి నుంచి వచ్చిన భక్తులు బాబాను దర్శించుకున్నారు. ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగజగదీశ్వరరావు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు తదితరులు బాబాను దర్శించుకున్నారు. మధ్యాహ్నం భారీ అన్న సమారాధన నిర్వహించారు. సాయంత్రం సాయిబాబా విగ్రహాన్ని అందంగా అలంకరించి పల్లకీ సేవ, భజనలు, కోలాటాలతో గ్రామంలో ఊరేగించారు.స్వామి వారిని భక్తులు దర్శించుకున్నారు.

వైభవంగా శ్రీనివాసుని కల్యాణం..

పద్మావతి, భూదేవి సమేత శ్రీనివాసుని కల్యాణోత్సవాన్ని కూడా వేద మంత్రాల నడుమ వైభవంగా నిర్వహించారు. భక్తులు కనులారా వీక్షించి భక్తి పారవశ్యం చెందారు. వేంకటేశ్వరస్వామి భారీ సెట్ వేశారు. ఇది ఆహూతులను అలరించింది. అలాగే సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. అనకాపల్లికి చెందిన ప్రభుత్వ వైద్యురాలు పి.భవానీ కుచిపూడి నృత్యం ఆహూతులను అలరించింది. అన్నమయ వాగ్గేయ బృందానికి చెందిన పలువురు మహిళలు అన్నమయ కీర్తనలు ఆలపించి ఆకట్టుకున్నారు. పలు మహిళా బృందాలు ఒకేసారి కోలాటాలు ప్రదర్శించి ఆహ్లాదం కలిగించారు. అనకాపల్లికి చెందిన చిన్నారులు కుచిపూడి నృత్యాలు, రాధాకృష్ణుల బృందగాన ప్రదర్శనలతో రంజింపజేశారు.

బీహార్ మాజీ సీఎం మండల్‌కు ఘన నివాళి



బీహార్ మాజీ సీఎం ప్రసాద్ మండల్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

అనకాపల్లి : స్థానిక రింగ్ రోడ్డు ఏపీ సీమాంధ్ర బీసీ సంక్షేమ సంఘం కార్యాలయంలో బీహార్ మాజీ ముఖ్యమంత్రి బాబు బిందేశ్వరి ప్రసాద్ మండల్ 106వ జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర యువజన విభాగం సహాయ కార్యదర్శి ఆళ్ల ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ ప్రసాద్ మండల్ బీహార్ ఏడో ముఖ్యమంత్రిగా పని చేశారన్నారు. 30 రోజుల తర్వాత పదవికి రాజీనామా చేశారన్నారు. మండల కమీషన్‌గా ప్రసిద్ధి చెందిన రెండవ వెనుకబడిన తరగతుల కమీషన్‌కు చైర్మన్‌గా ఆయన విధులు నిర్వహించారని అన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం మాజీ ప్రధాన కార్యదర్శి బొట్టా చిన్నియాదవ్, రాష్ట్ర కార్యదర్శి బద్దం పైడిరాజు, సంఘం జిల్లా అధ్యక్షుడు చిన్నమూర్తి, సభ్యులు పల్లా గోవింద్, చందాన కృష్ణారావు, నరిసే చిరంజీవి, కడమంచిలి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ విధానాలు, డిజైన్ లోపం వల్లే ఎసెన్షియా ప్రమాదం

సీపీఎం జిల్లా కార్యదర్శి లోకనాథం విమర్శ

అనకాపల్లి : అచ్యుతాపురం సెజ్‌లోని ఎసెన్షియా ఫార్మా కంపెనీలో జరిగిన ప్రమాదానికి ప్రభుత్వ విధానాలే కారణమని తేటతెల్లమయ్యిందని, ఫార్మాలో రియాక్టర్ పైపులైన్, డిజైన్‌లోని లోపాలే ప్రధాన లోపమని రాష్ట్ర విపత్తుల నిర్వహణ, అగ్నిమాపక శాఖ డీజీ ప్రకటించారని సీపీఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దీన్ని బట్టి ప్రభుత్వాలు కంపెనీల యాజమాన్యాల పట్ల ఎంత ఉదాసీనంగా ఉంటున్నాయో అర్థమవుతుందని ఆయనన్నారు. కంపెనీల వారీగా సేఫ్టీ ఆడిట్ నిర్వహించి ఆ నివేదికలను నోటీసు బోర్డులో ప్రదర్శించాలన్నారు. యాజమాన్యాలు లోపాలను వెంటనే సరి చేయకపోతే చట్టపరమైన చర్యలు తీసుకునేలా ప్రభుత్వాలు వ్యవహరించాలని ఆయన పేర్కొన్నారు.

కృష్ణాష్టమి వేడుకలకు సన్నాహాలు

కశింకోట : స్థానిక ధ్యాన వేంకటేశ్వరస్వామి ఆలయంలో సోమవారం కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకుడు రేజేటి రామచరణాచార్యులు తెలిపారు. ఉదయం విష్ణు సహస్ర నామార్చన, విశేష అర్చన, సాయంత్రం ఊంజల్ సేవ నిర్వహించనున్నట్లు తెలిపారు. అలాగే కోనేరు వద్ద వెలసిన శ్రీకృష్ణ మందిరంలో కూడా సోమవారం శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు నిర్వహించడానికి సన్నాహాలు చేసినట్లు యశోద కృష్ణ యాదవ సంక్షేమ సంఘం ప్రతినిధులు తెలిపారు. ఈ సందర్భంగా ఆలయంలో ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహిస్తామని, మధ్యాహ్నం అన్న సమారాధన జరుగుతుందన్నారు. మండలంలోని జమాదులపాలెం, బయ్యవరం, అచ్చెర్ల, మోసయ్యపేట, సింగవరం, సుందరయ్యపేట తదితర గ్రామాల్లో కూడా కృష్ణాష్టమి ఉత్సవాలు నిర్వహించడానికి సన్నాహాలు చేశారు.

ట్రిపుల్ ఐటీలో సీటు సాధించిన కుసుమకు అభినందనలు

కశింకోట : కశింకోటలోని బాలికల హైస్కూల్లో ఈ ఏడాది టెన్త్ చదివిన కశింగ కుసుమకు ట్రిపుల్ ఐటీ సీటు లభించింది. 567 మార్కులతో ఉత్తీర్ణత సాధించిన ఆమెకు ఒంగోలు ట్రిపుల్ ఐటీలో తాజాగా సీటు వచ్చినట్లు హెచ్ఎం ఎంఎస్ స్వర్ణ కుమారి తెలిపారు. ఆమెతో పాటు ఉపాధ్యాయ సిబ్బంది కుసుమను అభినందించారు.

పాత పెన్షన్ విధానం పునరుద్ధరించాలి

అనకాపల్లి : కొత్త ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి గొంది చినబ్బాయ్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం యూనిఫైడ్ పెన్షన్ స్కీమ్ ప్రవేశానికి ప్రకటన జారీ చేసిందన్నారు. ఈ పథకం ద్వారా 25 సంవత్సరాల సర్వీసు పూర్తి చేసిన కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు 50 శాతం పెన్షన్ తో పాటు గ్రాట్యుటీ, డీఆర్ కూడా ఇస్తామని ప్రకటించారన్నారు. ఉద్యోగులు మాత్రం పాత పెన్షన్ విధానం (ఓపీఎస్)లో ఉన్న ప్రయోజనాలను మాత్రమే కోరుకుంటున్నారని ఆయన పేర్కొన్నారు. కాబట్టి నూతన ప్రభుత్వం ఉద్యోగుల చందాతో పనిలేని పాత పెన్షన్ పథకం కోసం ఆలోచన చేయాలని కోరారు.

క్యాన్సర్ రోగికి 'స్నేహాంజలి' బాసట



క్యాన్సర్ రోగి అచ్చియ్యమ్మకు నగదు అందజేస్తున్న సంతోషి నళిని తదితరులు

దేవరాపల్లి : క్యాన్సర్ బారిన పడి తీవ్ర అనారోగ్యం, ఆర్థికపరమైన ఇబ్బందులతో సతమతమవుతున్న వృద్ధురాలికి స్నేహాంజలి ఫర్ పూర్ ఆర్గనైజేషన్ బాసటగా నిలిచింది. చీడికాడ మండలం అర్జునగిరి చెందిన నిరుపేద వృద్ధురాలైన సాలాపు అచ్చియ్యమ్మ క్యాన్సర్ బారిన పడి వైద్య ఖర్చులకు సైతం ఇబ్బందులు పడుతోంది. దేవరాపల్లిలో బంధువుల ఇంటి వద్ద ఉంటున్న నిరుపేద వృద్ధురాలికి రూ.12వేలు నగదును ఆదివారం స్నేహాంజలి ఫర్ పూర్ ఆర్గనైజేషన్ సభ్యులు అందజేసి మానవత్వం చాటుకున్నారు. ఈ నగదును అందించిన వారిలో స్నేహాంజలి ఫర్ పూర్ ఆర్గనైజేషన్ సభ్యురాలు, స్థానిక ఇంచార్జ్ ఈవోపీఆర్డీ జి. సంతోషి నళిని, ఆర్గనైజేషన్ వలంటీర్లు సన్యాసినాయుడు, వాసు ఉన్నారు. ఈ ఆర్గనైజేషన్ ద్వారా ఇప్పటి వరకు 202 సేవా సహాయ కార్యక్రమాలు చేపట్టినట్టు సభ్యురాలు సంతోషి నళిని తెలిపారు.

సీతమ్మకు మంగళ సూత్రాల బహూకరణ



బంగారు మంగళ సూత్రాలు ఆలయ అర్చకులకు అందజేస్తున్న ఎంపీటీసీ శ్రీనివాసరావు తదితరులు

మాడుగుల రూరల్ : కె.జె.పురం సీతారామస్వామి ఆలయంలో సీతమ్మతల్లికి బంగారు మంగళ సూత్రాలను ఆదివారం బహూకరించారు. గ్రామానికి చెందిన పాలకుర్తి వెంకట రమణ, బేబీ కుమారుడు అయిన మోహన్‌రావు ఆర్థిక సహకారంతో ఆయన భార్య కుసుమ జ్ఞాపకార్థం బంగారు మంగళ సూత్రాలను ఆలయ ప్రధాన అర్చకులు వెంకట రమణకు ఎంపీటీసీ సభ్యుడు భీశెట్టి శ్రీనివాసరావు అందజేశారు. సంతోషిమాత ఆలయ కమిటీ చైర్మన్ కాళ్ల అమ్మతల్లినాయుడు పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికుల ఆందోళన



సీఐటీయూ ఆధ్వర్యంలో ఆందోళన చేస్తున్న పంచాయతీ కార్మికులు

రోలుగుంట: తమ సమస్యల పరిష్కారం కోసం పంచాయతీ కార్మికులు ఆదివారం సీఐటీయూ ఆధ్వర్యంలో సమావేశం, ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం వీరి సమస్యలపై సీఐటీయూ మండలశాఖ అధ్యక్షుడు ఈరెల్లి చిరంజీవి మాట్లాడారు. గ్రామాలను పరిశుభ్రం చేస్తూ తద్వారా ఆరోగ్య గ్రామాలుగా తయారు చేయడానికి పారిశుధ్య కార్మికుల సేవలే కీలకం అన్నారు. వీరి సేవలను గమనంలోకి తీసుకొని కనీస వేతనాల జీవో అమలు చేయాలన్నారు. అలాగే వారికి గ్లౌజులు, నూనె, సబ్బులు, యూనిఫాం, ఐడీ కార్డులివ్వాలని, బీమా సౌకర్యం కల్పించాలని కోరారు.

నూకాంబిక ఆలయ పునర్నిర్మాణ పనులకు శ్రీకారం



అమ్మవారిని మరో ప్రాంతానికి తరలిస్తున్న దృశ్యం

రోలుగుంట : మండల కేంద్రం రోలుగుంటలో నూకాంబిక ఆలయం పునర్నిర్మాణ పనులను కమిటీ చేపట్టింది. ఈ ఆలయం శిథిలావస్థకు చేరుకోవడంతో స్థానిక భక్తులు కమిటీగా ఏర్పడి ఆలయాన్ని పునర్నిర్మాణానికి సంకల్పించారు. గత వారం ఆలయ గోడలు తొలగించారు. గర్భగుడి నుంచి అమ్మవారిని సమీపంలోకి భక్త కమిటీ తరలించింది. పనులు శరవేగంగా జరుగుతున్నాయని నిర్వాహకులైన మునసబ్ కుటుంబీకులతో పాటు ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు తెలిపారు.

మోదకొండమ్మ ఆలయానికి భక్తుల తాకిడి

మాడుగుల : ఉత్తరాంధ్ర ఇలవేలుల్పు మాడుగుల మోదకొండమ్మ ఆలయానికి ఆదివారం భక్తుల తాకిడి పెరిగింది. శ్రావణ ఆదివారం సందర్భంగా మోదకొండమ్మను నగలు, పూలు, ఆకర్షణీయమైన వస్త్రాలతో అలంకరించారు. అధిక సంఖ్యలో మహిళా భక్తులు అమ్మవారిని దర్శించుకుని కుంకుమ పూజల్లో పాల్గొన్నారు.